batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

16 ఆగస్టు 2026
ఆదివారం

పండుగ వాతావరణంలో అట్టహాసంగా

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

05

డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శకత, జవాబుదారీతనం

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి ... పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు



02

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ

## సంబరాలు

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, డెయిరీ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఆర్టీసీ, విద్యుత్, పౌర సరఫరాలు, హౌసింగ్ తదితర శాఖల శకటాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు.

– నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ



## తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం

భారత్ ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చబోతుంది

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

హైదరాబాద్, బతుకమ్మ : గడిచిన రెండున్నరేళ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశామని, భవిష్యత్తు తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయానికి ప్రజలు, ఉద్యోగులు, అధికారులు అందించిన సహకారం కీలకమని పేర్కొంటూ, భగవంతుడి ఆశీస్సులు, ప్రజల సహకారంతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సీఎం పిలుపునిచ్చారు. గడిచిన 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో నాలుగు కోట్ల మంది ప్రజలకు భరోసా కల్పించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు సామాజిక న్యాయంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించామని చెప్పారు.

## ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు

నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

సంగారెడ్డి, బతుకమ్మ :ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ఇకపై ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వంలోని ఏ ఖాళీని కూడా గాలికి వదిలేయబోమని స్పష్టం చేసిన ఆయన.. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు.






## బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

తెలంగాణ మళ్లీ పట్టాలెక్కుతుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

హైదరాబాద్, బతుకమ్మ :బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణ రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలోకి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు.

# బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. భాషలు, సంస్కృతులు వేరైనా భారతీయత అనే భావన దేశ ప్రజలందరినీ కలిపి ముందుకు నడిపిస్తోందన్నారు. స్వాతంత్ర్యం సాధించిన అనంతరం దేశం అభివృద్ధి చెందాలని సమరయోధులు ఆశించారని, అయితే ఎనిమిది దశాబ్దాలు గడిచినా వారు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని వ్యాఖ్యానించారు. దేశంలోని ఇంకా అనేక గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందకపోవడం బాధాకరమన్నారు. సాగునీటి సమస్యతో రైతులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దేశంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. చైనా గత నాలుగు దశాబ్దాల్లో సాధించిన అభివృద్ధిని మన కళ్లముందే చూస్తున్నామని, భారతదేశానికి చైనా కంటే ఎక్కువ వనరులు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో వెనుకబడి ఉన్నామని కేటీఆర్ అన్నారు. దేశాన్ని పరిపాలించే వారికి సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఆరోపించారు. బలహీనమైన దేశాలతో పోల్చి ప్రజలను మభ్యపెట్టడం కాకుండా భారత్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా పాలన సాగాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధిపై కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయనకు తెలంగాణ అభివృద్ధిపై ఎంతమేరకు చిత్తశుద్ధి ఉంటుందని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి వంటి అంశాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉండేవని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 24 గంటల విద్యుత్ సరఫరా అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనూ విద్యుత్ సమస్యలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సింగిల్ ఇంజన్‌తోనే వేగంగా అభివృద్ధి చెందిందని, కేంద్రం చెబుతున్న డబుల్ ఇంజన్ ప్రభుత్వాలకంటే రాష్ట్రం అనేక రంగాల్లో ముందంజలో ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం, దాని విధానాలపై విమర్శలు చేసిన కేటీఆర్.. తెలంగాణ దివాళా తీసిందంటూ చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం పనిచేయాలని, రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడుతూ త్వరలో జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రతిరోజూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న కేటీఆర్.. కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన జలదృశ్యం నుంచే పార్టీ ప్రయాణం ప్రారంభమైందన్నారు. ఒకప్పుడు టీఆర్ఎస్ కార్యాలయానికి భవనాలు అద్దెకు ఇవ్వడానికి కూడా కొందరు భయపడేవారని తెలిపారు. తెలంగాణ భవన్ నిర్మాణానికి 20 ఏళ్లు పూర్తయ్యాయని, తెలంగాణ ఉద్యమానికి, ప్రజలకు నిరంతరం స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఆలోచన మేరకు ఈ భవనం నిర్మించబడిందన్నారు. తెలంగాణ భవన్ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని కేటీఆర్ అన్నారు. భవన నిర్మాణంలో శ్రమించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తామని, తెలంగాణ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. జాతి నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు



ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతులు, మహిళలు, యువతకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పేదలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి పథకాన్ని ప్రారంభించిన అనంతరం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైన తర్వాత మార్కెట్‌లో వాటి ధర కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు తగ్గిందన్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంపై రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత 32 నెలల్లో రైతులు పండించిన పంటల కొనుగోలుకు రూ.90 వేల కోట్లు చెల్లించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. రూ.21 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసి 25 లక్షల మంది రైతులను రుణభారం నుంచి విముక్తి చేశామని పేర్కొన్నారు. రైతు భరోసా మొత్తాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచి, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు అందించామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులను రాజులా గౌరవించే సంస్కృతి తమ ప్రభుత్వానిదని అన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్ రెడ్డి చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీకే రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ అందించామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించామని చెప్పారు. తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మహిళలకు కేటాయించామని, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్ అందించడంతో పాటు చేనేత, గీత కార్మికులు, సికిల్ సెల్ అనీమియా బాధితులకు కూడా పెన్షన్ అందించాలని నిర్ణయించామని చెప్పారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల విషయంలో నిరుద్యోగ యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని తెలిపారు. ఉద్యోగాల భర్తీ తమ ప్రభుత్వ బాధ్యత అని, అన్ని పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులకు వడ్డీలు చెల్లిస్తూ విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి ఏటా రూ.75 వేల కోట్లు అప్పుల చెల్లింపులకు వెచ్చిస్తున్నామని తెలిపారు. సంక్షోభంలో ఉన్న సంక్షేమ పథకాలను గాడిలో పెట్టి అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొంటూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. కంజర రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, విశ్వ వికాస్ హైస్కూల్, నవీపేట్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు, టైం స్కూల్ చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి పి.సుదర్శన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్.భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ట్రైనీ కలెక్టర్ సురేష్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం

భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికత, నైపుణ్యాలపై బలమైన పునాదులు వేశామని, ఈ విజయాల పునాదిపైనే తెలంగాణను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బృహత్తర సంకల్పంతో తెలంగాణ రైజింగ్-2047 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. తాజా ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం 2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం దాదాపు 91 శాతం అధికంగా ఉందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలాన్ని ఇది చాటిచెబుతోందని అన్నారు. సంక్షేమాన్ని కేవలం ఖర్చు చేసిన రూపాయలతో లెక్కించకుండా, పేదల పట్ల మానవీయత, బాధ్యత, వారి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఆత్మగౌరవం కల్పించాలన్న లక్ష్యంతో పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే నమ్మకంతో రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల కష్టాలను తీర్చి వ్యవసాయాన్ని పండగ చేయాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకున్నామని, వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ పంజాబ్‌ను అధిగమించి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. సంక్షేమ పథకాల్లో సన్నబియ్యం పథకం విప్లవాత్మకమైనదని, పేదలకు ఆరోగ్యకరమైన ఆహారం, ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని అన్నారు. 93 లక్షలకు పైగా కుటుంబాలు, దాదాపు 3.38 కోట్ల మంది ప్రజలను ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు భరోసా కల్పిస్తూ 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. కొత్త సాంకేతికతతో రేషన్ పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతున్నామని చెప్పారు. పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు సహా 43 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు. పన్నెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను ప్రజా ప్రభుత్వం ఆమోదించిందని, దీని ద్వారా సుమారు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం దేశంలోనే ఆదర్శవంతమైన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చామని చెప్పారు.

విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుందని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడాన్ని ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటివరకు ప్రభుత్వ శాఖల్లో 72 వేలకు పైగా ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని వెల్లడించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించామని, నోటిఫికేషన్ ఇచ్చి ఆగిపోకుండా పరీక్షలు, ఫలితాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించామని చెప్పారు. టీజీపీఎస్సీ ద్వారా 456 వివిధ పోస్టులు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టామని సీఎం వివరించారు. గోషామహల్‌లో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించామని, మరో ఎనిమిది మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. డ్రగ్స్, ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు కొత్తగా టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహించి కల్తీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజా ప్రభుత్వ విజయాల్లో ఉద్యోగులు, అధికారులు కీలక భాగస్వాములని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం నుంచి సంక్షేమ పథకాలను చివరి లబ్ధిదారుడికి చేర్చడం వరకు, పెట్టుబడులను ఆకర్షించడం నుంచి అన్ని రంగాల్లో ప్రభుత్వ సేవలను విస్తరించడం వరకు ఉద్యోగులు, అధికారుల సహకారం ఎంతో కీలకమని తెలిపారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ఆగస్టు 17 నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, త్వరలో ప్రజావాణి ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రారంభించి ఎక్కడి నుంచైనా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, ప్రపంచంతోనే అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు కార్యాచరణ ప్రారంభించామని, ప్రజా పాలనలో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు తెలంగాణపై నమ్మకం పెరిగిందని చెప్పారు. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్‌లో బిజినెస్ ఎంట్రీ, కన్‌స్ట్రక్షన్ పర్మిట్ ఎనేబ్లర్స్, సర్వీస్ సెక్టార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో తెలంగాణ టాప్ అచీవర్‌గా నిలవడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెబుతామని తెలిపారు. ఐటీ రంగంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం వెల్లడించారు. 2025-26లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని, ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయని చెప్పారు. హైదరాబాద్‌లో 355కు పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు పనిచేస్తున్నాయని, 2026లో కొత్తగా 40 గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌కు వచ్చాయని తెలిపారు. డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణ దేశంలో వేగంగా ఎదుగుతున్న గమ్యస్థానాల్లో ఒకటిగా మారిందన్నారు. అమెజాన్ తెలంగాణలో అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రకటించిందని, భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో దేశంలోని అతిపెద్ద హైపర్‌స్కేల్, ఏఐ-రెడీ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఒకటి రూపుదిద్దుకుంటోందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఈ విషయంలో పెద్దమనసుతో అర్థం చేసుకోవాలని కోరుతూ, ఎవరికీ ఎలాంటి నష్టం, కష్టం రానివ్వబోమని స్పష్టం చేశారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. భగవంతుడి ఆశీస్సులతో పాటు ప్రజల సహకారం తోడైతే మరిన్ని విజయాలు సాధించి తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుపై మోడీ ఫోటో ఉండాల్సిందే

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పై దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో ఉండాల్సిందేనని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులకు రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యం లో అత్యధికంగా కేంద్ర వాటా ఉందని గుర్తు చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం దేశ ప్రధాని మోడీ ఫోటో వేయకపోవడం తగదన్నారు. అలాగే జిల్లాలో అనేకచోట్ల బియ్యం పక్కదారి పడుతుందని వాటిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని అన్నారు.



# ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

## కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ శ్రామిక్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌ఎస్పీ పార్టీ జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల జీవనభృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రాఫిక్ పోలీసుల వేధింపులను నిలిపివేయాలని కోరారు.



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాల నేపథ్యంలో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కటారి రాములు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఫీ ఉద్దీన్, అబ్దుల్ ముజీబ్, పండరి, కృష్ణ, ఇర్ఫాన్, మహమ్మద్ నిజాముద్దీన్, మొహమ్మద్ అనీష్, పి. విట్టల్, ఇమ్రాన్, అక్రమ్ ఖాన్, అస్రాఫ్, అయ్యూబ్, అజ్జు తదితర ఆటో కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా..

### ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాలయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి అనంతరావు జెండాను ఆవిష్కరించారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుమలత జాతీయ జెండాను ఎగురవేశారు. అటవీ రేంజ్ కార్యాలయం వద్ద అటవీ రేంజ్ అధికారి రవిమోహన్ భట్ జాతీయ జెండాను ఆవిష్కరించి, వందేమాతరం గీతాలాపన చేశారు. ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం సునీత జాతీయ జెండాను ఎగురవేయగా సిబ్బంది పాల్గొన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల కిషన్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి గంగాధర్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. నల్లవెల్లి సింగిల్ విండో కార్యాలయంలో సహకార సంఘం చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఇందల్వాయి సహకార సంఘంలో చైర్మన్ గోవర్ధన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మండలంలోని గ్రామ గ్రామాన ప్రభుత్వ పాఠశాలలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆయా ఉపాధ్యాయులు, అధికారులు ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

# మహనీయుల త్యాగాల స్ఫూర్తితో దేశ సమైక్యతను కాపాడాలి







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ-కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉత్తమ ప్రధానోపాధ్యాయులు దాసరి విజయానందరావు, డాక్టర్ సవితారాణి పాల్గొన్నారు. వారు జాతీయ జెండాను ఆవిష్కరించగా, అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవితారాణి మాట్లాడుతూ.. వందల ఏళ్లపాటు బానిస సంకెళ్లలో మగ్గిన భారత ప్రజలు స్వాతంత్ర్యం కోసం ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" వంటి నినాదాలతో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తుచేశారు. శాంతి, అహింసతో పాటు సాయుధ, విప్లవ ఉద్యమాల ద్వారా స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపించగా, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు సైతం బ్రిటీష్ వారికి ఎదురొడ్డి వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని బాలలు, యువత, పెద్దలు ప్రతి ఒక్కరూ దేశ సమైక్యత, సమగ్రత కోసం బాధ్యతగా పనిచేయాలని దాసరి విజయానందరావు సూచించారు. ప్రపంచ నలుమూలలా భారతదేశ గొప్పతనాన్ని చాటేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు దేశభక్తి గీతాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మానసిక దివ్యాంగులు, అంధ విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య, అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోశాధికారి తాటి సుధాకర్, జాయింట్ సెక్రెటరీ షేర్ల దయానంద్, వర్గ సభ్యులు రమణారెడ్డి, లోకల్ కమిటీ చైర్మన్ బాబా గౌడ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నిరంజన్ ప్రసాద్, దాత వేదవతి కులకర్ణి, స్నేహ సొసైటీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పిలుపునిచ్చారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిజామాబాద్ నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ బిగాల నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎల్లమ్మగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి తో కలిసి గణేష్ బిగాల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆర్ఆర్ చౌరస్తా శివాజీ చౌక్‌లో సిర్ప రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తదుపరి జూబ్లీ హోటల్ చౌరస్తా, ఖిల్లా రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ మతీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే 58వ డివిజన్ అధ్యక్షులు సమీ ఆధ్వర్యంలో దారుగల్లిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 15వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ముస్తాక్ ఆధ్వర్యంలో నిజాం కాలనీ మెయిన్ రోడ్, అర్సపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ గణేష్ బిగాల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.

# న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ పతాకవిష్కరణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాది పరిషత్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతి నగర్‌లో గల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల ఉద్యమాలు, ప్రాణత్యాగాల ఫలితంగా బ్రిటిష్ వలస పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశ సార్వభౌమత్వానికి సవాలుగా మారిన పాక్ ప్రేరేపిత తీవ్రవాదాన్ని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందని పేర్కొన్నారు. భారత సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు అభినందనీయమని అన్నారు. నేటి యువత దేశభక్తితో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరిషత్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, పడిగేల వెంకటేశ్వర్, సి. సాయిరెడ్డి, నారాయణదాస్, సుదర్శన్ రెడ్డి, ఎర్రం విఘ్నేష్, జయసింహ, పూపాల విజయ్, పిండం రాజు, ఉదయ్ కృష్ణ, గోవర్ధన్, ప్రభాకర్, హనుమంత్ రెడ్డి, సింగం అంజలి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పాలనాధికారి భవేష్ మిశ్రా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ట్రైనీ కలెక్టర్ సురేష్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జుక్కల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ మండలంలోని అన్ని గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాల నుంచి ప్రారంభమైన పెరేడ్ ప్రధాన వీధుల గుండా కొనసాగుతూ సంబంధిత కార్యాలయాల వరకు నిర్వహించారు. జుక్కల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ప్రజలు జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జుక్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక హైస్కూల్‌లో తిరుపతి రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సభలో సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి జుక్కల్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడాలి

### పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద, అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో జాతీయ జెండాను ఘనంగా ఎగురవేశారు. సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు పెద్ది వెంకట్ రాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విగ్నేష్, సురేష్, నగర నాయకులు అనసూయమ్మ, అనిత, శంషాద్దీన్, అంజయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆనంద్, సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో బార్దాన్ కార్మికుల సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాములు, ఇమామ్, సురేష్, గంగాధర్, విజయ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు. కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## నైపుణ్యం, చతురతతోనే దేశ అభివృద్ధి

### జాతీయ జెండా ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



కామారెడ్డి, బతుకమ్మ :నైపుణ్యం, చతురతతోనే దేశం గణనీయమైన అభివృద్ధి సాధించిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత గంప గోవర్ధన్ అన్నారు. యువత ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని దేశ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కామారెడ్డి బీఆర్ఎస్ నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద గంప గోవర్ధన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యాలను పెంపొందించుకుని యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని గంప గోవర్ధన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ మహ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : దేశభక్తి, ఐక్యత, సమానత్వం వంటి విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ మహ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ బోధన్ రోడ్‌లోని 34వ డివిజన్‌లో మాదిగ సంఘం ఆధ్వర్యంలో జాతీయ త్రివర్ణ పతాకా విష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మాదిగ సంఘం అధ్యక్షులు టి. హరికృష్ణ, 34వ డివిజన్ ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జి టి. భాగ్యలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి అహ్మద్ ఫాజిల్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సంఘం ప్రతినిధులు, మహిళా మండలి సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. అనంతరం మహ్మద్ షకీల్ అహ్మద్ ఫాజిల్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ముందుగా అందజేయలేకపోయినా, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సంబంధిత నోటీసులు అందిన వెంటనే ప్రజలు తమ వద్ద ఉన్న ఆధారాలు, పత్రాలను సమకూర్చి అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, సమస్యలు ఎదురైన సందర్భంలో వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 34వ డివిజన్ ఎంఐఎం పార్టీ ఇన్‌చార్జి టి.భాగ్యలక్ష్మి డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని షకీల్ అహ్మద్ ఫాజిల్ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఎంఐఎం పార్టీ నాయకులు, ప్రతినిధులు అండగా ఉంటారని ఆయన తెలిపారు. డివిజన్‌లో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టి. బాబు, పల్లె సాయికుమార్, మహేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సంఘం ప్రతినిధులు, మహిళా మండలి సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు తోడుగా 'హెల్పింగ్ హాండ్స్'

వేల్పూర్, బతుకమ్మ :వేల్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచిన రేగుల రిషిక, రెండో స్థానంలో నిలిచిన మానేపల్లి శ్రీనిజ, మూడో స్థానంలో నిలిచిన సేరు అనన్యలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా విద్య, వైద్య రంగాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే నిరుపేద విద్యార్థులు ఎవరైనా ఉంటే, వారి విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందించేందుకు తమ సంస్థ ముందుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాజశ్రీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ బతుకమ్మ :బాల్కొండ మండలంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మండలంలోని జలాల్పూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు మోహన్ రెడ్డి తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కత్తి భోజన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కూడా కలిసి సానుభూతి తెలిపారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రంజిత్ యాదవ్ తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా బీఆర్ఎస్ కార్యకర్త ద్యావతి రవికి ఇటీవల హార్ట్ ఆపరేషన్ జరగడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాల్కొండ గ్రామంలోని 8వ బూత్ ఇంచార్జ్ పిప్పెర ప్రవీణ్ కుమార్తెకు క్యాన్సర్ గడ్డకు శస్త్రచికిత్స జరగడంతో వేముల ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారికి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్స ఖర్చుల నిమిత్తం కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బాన్సువాడలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

బాన్సువాడ, బతుకమ్మ :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణ కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ నరేందర్ గౌడ్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ విట్టల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్ పతాకావిష్కరణ చేశారు. అలాగే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ తుల శ్రీధర్, రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ తిరుపతయ్య, ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ దిలీప్ కుమార్, విద్యుత్ కార్యాలయంలో ఏఈ సంతోష్ కుమార్, మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం నాగరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మున్నూరుకాపు సంఘం వద్ద రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, ఫారెస్ట్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ హబీబ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఫైర్ స్టేషన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తదితర కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాజకీయ పార్టీల కార్యాలయాల్లోనూ వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మాసాని శేఖర్ రెడ్డి, బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, సీపీఐ కార్యాలయంలో దుబాస్ రాములు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



పట్టణంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో కూడా జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పండుగ వాతావరణంలో అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శకత, జవాబుదారీతనం

## ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి

## పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిజామాబాద్ లో శనివారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.
జ్యోతి ప్రజ్వలన చేసి, జయ జయహే తెలంగాణ గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత కలిగిన వారి తరహాలోనే నిరుపేద కుటుంబాలు కూడా మూడు పూటల అన్నం తినాలనే ఉదాత్తమైన ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం అందించిన దొడ్డు బియ్యం తినడానికి ఉపయోగపడక 70 శాతం అమ్ముకునే వారని, సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిపోయేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో పేదలకు ఆహార భద్రత భరోసా ఏర్పడిందని అన్నారు. డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చిందని తెలిపారు.
పేదల కోసం ఉద్దేశించిన రేషన్ సన్న బియ్యం ఒక్క గింజ కూడా పక్కదారి పట్టకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. స్మార్ట్ కార్డుల వల్ల లబ్ధిదారులకు రేషన్ పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని, ఎక్కడి నుంచి అయినా ఈ కార్డు ద్వారా రేషన్ సరుకులు పొందే వెసులుబాటు లభించిందని అన్నారు.
ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, వ్యవసాయం, విద్య, ఉపాధి, ప్రజా సేవల రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిరంతర కృషిని కొనసాగిస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో 4.77 లక్షల కుటుంబాలకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా ఈ కార్డులను పంపిణీ చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తొమ్మిది రకాల భద్రతా ప్రమాణాలను జోడిస్తూ డిజిటల్ రూపంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల నకిలీ, బినామీలు, రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, అర్హులైన వారికి నేరుగా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు.
నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమానికి రైతు భరోసా, మహిళలకు అండగా కళ్యాణ లక్ష్మి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డుల జారీపై తగిన దృష్టి పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని గుర్తు చేశారు. డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనలో మరో కీలక ముందడుగు వేసిందన్నారు.
సాంకేతికత ఆధారిత పాలన ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, 2047 నాటికి రైజింగ్ తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.
నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డిలు మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం దక్కేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా అక్రమాలకు తావులేకుండా జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. గత సీజన్ లో ధాన్యం విక్రయాలకు రైతులు ఒకింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, రేషన్ డీలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు చోట్ల జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పోలీస్ కార్యాలయం, క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డీఐజీ బాసర జోన్-2 క్యాంప్ కార్యాలయంలో అదనపు కమిషనర్ (అడ్మిన్) శుభం ప్రకాష్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అదే విధంగా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ లో ఏఆర్ ఏసీపీ శ్రీరాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమం అనంతరం పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. అలాగే కార్యక్రమానికి హాజరైన అధికారులు, సిబ్బంది, ఇతరులకు స్వీట్లు పంపిణీ చేశారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పేలా జరిగిన ఈ కార్యక్రమాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పోటీతత్వం పెంపొందించేందుకు విద్యార్థినికి జెండా ఆవిష్కరణ అవకాశం



ఇందల్వాయి, బతుకమ్మ :ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామంలోని ప్రధాన జాతీయ జెండాను ఆవిష్కరించే అవకాశం కల్పిస్తున్నట్లు తీర్మాన్‌పల్లి గ్రామ సర్పంచ్ చింతల కిషన్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీతత్వాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఇందులో భాగంగా 2025 - 26 విద్యా సంవత్సరంలో తీర్మాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన మేకల హర్షికకు ఈసారి జాతీయ జెండాను ఆవిష్కరించే అవకాశం లభించింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతల కిషన్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ సమక్షంలో హర్షిక గ్రామంలోని ప్రధాన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇటువంటి అవకాశాలు కల్పించడం ద్వారా ఇతర విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జరుగు రవి, గ్రామ కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ యువతతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన మొహమ్మద్ కాజీమ్



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని బాగ్‌బాన్ కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ కాజీమ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ జెండాకు గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా మొహమ్మద్ కాజీమ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా అందరూ సోదరభావంతో మెలగుతూ దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు, స్థానికులు పరస్పరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాగ్‌బాన్ కమిటీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫాజిల్ , కార్యదర్శి మహమ్మద్ ఫరూక్ , బాగ్‌బాన్ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, యువకులు, చిన్నారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



రుద్రూర్, బతుకమ్మ :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, గ్రామపంచాతీ కార్యాలయం వద్ద సెక్రెటరీ ప్రేమ్ దాస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై మనోజ్ కుమార్, తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపిడివో బాలగంగాధర్, ఐకెపి కార్యాలయం వద్ద మహిళా సమైక్య అధ్యక్షురాలు, చేనేత సహకార సంఘం వద్ద అధ్యక్షులు లోల శంకర్, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి కేంద్రాలలో జాతీయ పథకాన్ని ఎగురవేసి 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేత

రుద్రూర్, బతుకమ్మ :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలోని బొప్పాపూర్ ఎంపియుపిఎస్ పాఠశాలలో శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన దాతలు గ్రామ సర్పంచ్ నందిగామ సుమలత కృష్ణ రూ.5 వేలు, మాజీ జడ్పిటీసి నారోజి గంగారాం రూ.5 వేలు, కుర్మాజి స్వామి రూ.2 వేలు విరాళంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్ట్స్, షూస్, స్కూల్ బ్యాగ్స్, ఏకరూప దుస్తువులను ఉచితంగా అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ మహోత్తర కార్యక్రమాన్ని చేపట్టిన దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసి అధ్యక్షులు పట్ల సురేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ బాలికల ప్రతిభను ప్రోత్సాహించడమే లక్ష్యం



పిట్లం, బతుకమ్మ :గ్రామీణ ప్రాంత బాలికలు విద్యలో రాణించి తమ ప్రతిభను చాటుకునేలా ప్రోత్సహించడమే 'సేవ్ ది గర్ల్ చైల్డ్ ఫౌండేషన్' లక్ష్యమని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పిట్లం మండలంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. నవాబ్ మహిపాల్ గౌడ్ (మాజీ ఎంపీపీ) జ్ఞాపకార్థం ఆయన మాతృమూర్తి అనసూయ చేతుల మీదుగా విద్యార్థినులకు మెమెంటోలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు రూ.3 వేలు , రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.50 వేల నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమానికి 'సేవ్ ది గర్ల్ చైల్డ్' ఫౌండర్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్‌తో పాటు ఆయన సోదరులు సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సంపూర్ణ సహకారం అందించారు. గ్రామీణ ప్రాంత బాలికల విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రతిభావంతులైన విద్యార్థినులకు అవార్డులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళా శక్తిగా ఎదగాలి

**ఏపిఎం బత్తుల మాణిక్యం**



వేల్పూర్, బతుకమ్మ :ప్రతి మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధించి దేశ ఆర్థిక రంగాన్ని శాసించే స్థాయికి ఎదగాలని వేల్పూర్ ఏపిఎం బత్తుల మాణిక్యం అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వేల్పూర్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించి మహిళలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా సహకారం అందిస్తున్నామని తెలిపారు. పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సుల నిర్వహణతో పాటు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకునే మహిళలకు రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకుని పిండి గిర్నీలు, కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్లు, కుట్టు మిషన్ల ద్వారా ఉపాధి, బట్టల వ్యాపారం తదితర రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఏపీఓ అశోక్, సీసీలు వెన్న మురళి, సాయన్న, సరళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బీజేపీ రుద్రూర్ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు గూడూరు ప్రశాంత్ గౌడ్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇత్తడి నాగరాజకుమారి, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్రోళ్ల గంగాధర్, మండల ఉపాధ్యక్షులు భోజిగౌండ అనిల్, బేగరి వినోద్ కుమార్, గుడిసె ప్రభాకర్, జీలకర్ర విజయ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, జి.శివకుమార్, మండల సీనియర్ నాయకులు, పార్వతి మురళి, బీవీ గుప్తా, చిదురా మహిపాల్, సుధాకర్, గొల్లశంకర్, బూత్‌అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అత్యుత్తమ సేవలు అందించిన పోలీస్ సిబ్బందికి సేవా పథకాలు

### 13 మంది సిబ్బందికి పథకాలు అందజేసిన ప్రభుత్వ సలహాదారు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన 13 మంది పోలీసు సిబ్బందిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలతో ఘనంగా సత్కరించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సేవా పతకాల ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చేతుల మీదుగా పోలీసు సిబ్బందికి సేవా పతకాలను అందజేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విశిష్ట సేవలు అందించినందుకు ఈ పతకాలకు వారు ఎంపికయ్యారు. సేవా పతకాలు అందుకున్న వారిలో సి.ఎస్.బి. నిజామాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీధర్ రెడ్డి, ఫింగర్‌ప్రింట్ ఇన్స్పెక్టర్ కె. రాజేందర్, ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్ కు చెందిన ఏ.ఆర్.ఎస్.ఐ. వై. సంజీవ్, ముప్కాల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి. చంద్రశేఖర్, ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్ హెడ్ కానిస్టేబుల్స్ ఆర్. చంద్రశేఖర్, మహమ్మద్ అబ్దుల్ సలీం, నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఏ. సాయిలు ఉన్నారు. అలాగే బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ టీ.వీ. గంగా మోహన్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పోలీస్ కానిస్టేబుల్ ఆర్. కనకయ్య, ఏ.ఆర్. హెడ్ క్వార్టర్స్ కానిస్టేబుల్ ఎం. మంగోత్య, టౌన్-3 పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి. శివకుమార్ గౌడ్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఎన్. కృష్ణ, సి.సి.ఎస్. పోలీస్ స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ కునాల స్వప్నలు సేవా పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీసు శాఖలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు విశిష్ట సేవలు అందిస్తున్న సిబ్బందిని ప్రభుత్వం గుర్తించి సేవా పతకాలతో సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పురస్కారాలు ఇతర పోలీసు సిబ్బందికి సైతం మరింత స్ఫూర్తినిచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తమ సేవలకు గుర్తింపుగా సేవా పతకాలు అందుకున్న పోలీసు సిబ్బందిని పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది అభినందించారు.

## టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :టీఎన్జీవో జిల్లా కార్యాలయ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణకు ముందు వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ గేయాన్ని పాడుతూ జెండా వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, జిల్లా ప్రజలకు సుమన్ కుమార్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్యం సాధించిన అనంతరం 80 వసంతాల్లో భారతదేశం సాధించిన అభివృద్ధిని కొనియాడారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో సాంకేతికతతో పోటీపడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, రాష్ట్ర అభ్యున్నతికి ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలని సుమన్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చుకూరి సతీష్, జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, కోశాధికారి నిరంజన్ గౌడ్, సలహాదారు వనమాల సుధాకర్, ఉపాధ్యక్షులు సంజీవయ్య, సునీత, జాఫర్ హుస్సేన్, అర్బన్ యూనిట్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, సర్వే స్పెషల్ యూనిట్ అధ్యక్షులు సూర్య ప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్, ప్రకాష్, రాజేశ్వర్, మహిళా జిల్లా కార్యవర్గ సభ్యులు గీతారెడ్డి, మంగమ్మ, విజయలక్ష్మి, క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటు పడాలి

### ప్రతి ఒక్కరు పూర్తి వందేమాతరం ఆలపించాలి
### పలు చోట్ల త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రతి ఒక్కరు దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు అసోసియేషన్ల కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తొలిసారి పూర్తి వందేమాతరం గీతాన్ని పాడాలని చట్టం తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. ఇకపై ఎక్కడైతే జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారో అక్కడ పూర్తి వందేమాతరం ఆలపించాలని కోరారు. స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఆనాటి అమరుల త్యాగాల వల్లే స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని పేర్కొ న్నారు. 2047 వరకు వికసిత్ భారత్ సాధించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ సమైక్యత, దేశ భద్రత, స్వదేశీ ఆత్మ విశ్వాసం దిశగా ముందుకు సాగాలన్నారు. మొదటగా బస్ స్టాండ్ ఆవరణలోని ఆటో స్టాండ్ అసోసియేషన్, అనంతరం లలిత కాంప్లెక్స్‌లోని మొబైల్ షాప్స్ అసోసియేషన్, అనంతరం క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే సన్ రైజ్ హాస్పిటల్ లో జాతీయ జెండాను ఎగుర వేశారు. బీజేపీ జిల్లా కార్యాలయం, కార్పొరేషన్ కార్యాలయంలో, పరేడ్ మైదానంలో జరిగిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



మోర్తాడ్, బతుకమ్మ :మోర్తాడ్ మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడగా, దేశభక్తి నినాదాలతో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాలలు, యువజన సంఘాలు, యూనియన్ నాయకులు, కుల సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనేక పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరణానంతరం ఇద్దరికి కంటిచూపునిచ్చిన ఎనిమిరెడ్డి జ్యోతి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మరణానంతరం తన కళ్లను దానం చేసి మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించిన కాలేపల్లి క్యాంపునకు చెందిన ఎనిమిరెడ్డి జ్యోతి ఆదర్శంగా నిలిచారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నిజామాబాద్ జిల్లా నాయకుడు ఎనిమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భార్య అయిన జ్యోతి కొంతకాలంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ, నిజామాబాద్‌లోని ప్రగతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. శుక్రవారం ఆమె అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు. జ్యోతి మరణానంతరం తన కళ్లను దానం చేయాలనే కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు పార్టీ నాయకుల సమక్షంలో లయన్స్ క్లబ్ ద్వారా కళ్లను సేకరించి సంబంధిత సంస్థలకు అప్పగించారు. ఆమె కళ్లదానం ద్వారా ఇద్దరికి కంటిచూపు లభించే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ, జ్యోతి విప్లవోద్యమానికి అనేక విధాలుగా సహకరించారని గుర్తుచేశారు. ఆమె భర్త శ్రీనివాస్ రెడ్డి రైతు కూలీ సంఘంలో పనిచేయడానికి జ్యోతి అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. మరణంలో కూడా సమాజ హితం కోరుతూ కళ్లదానం చేసిన జ్యోతి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జ్యోతి భర్త శ్రీనివాస్ రెడ్డి, కుమారుడు శివ తేజ రెడ్డి, కుమార్తె హంసికతో పాటు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పరుచూరి శ్రీధర్, నగర కార్యదర్శి నీలం సాయిబాబా, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ భూమయ్య, దేశెట్టి సాయిరెడ్డి, నాయకులు వేములపల్లి అరుణ, పిట్ల సరిత, సూర్య శివాజీ, జేపీ గంగాధర్, డి. బన్నీ, అగ్గు ఎర్రన్న చిన్నయ్య, డి. గంగాధర్, గోపాల్, గౌంట్యాల రమేష్, డి. మల్లికార్జున్, శివ, నీలం లక్ష్మి, సంజన, భారతి, నరసయ్య, సాయిలు, అనంతయ్య, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నగర అధ్యక్షుడు సిర్రం పవన్ కుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రామీణ బాలికల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం



పిట్లం, బతుకమ్మ :గ్రామీణ ప్రాంత బాలికలు విద్యలో రాణించి తమ ప్రతిభను చాటుకునేలా ప్రోత్సహించడమే 'సేవ్ ది గర్ల్ చైల్డ్ ఫౌండేషన్' లక్ష్యమని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పిట్లం మండలంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 23 మంది విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. నవాబ్ మహిపాల్ గౌడ్ (మాజీ ఎంపీపీ) జ్ఞాపకార్థం ఆయన మాతృమూర్తి అనసూయ చేతుల మీదుగా విద్యార్థినులకు మేమెంటోలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు రూ.3 వేలు , రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.50 వేల నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమానికి 'సేవ్ ది గర్ల్ చైల్డ్' ఫౌండర్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్‌తో పాటు ఆయన సోదరులు సుదర్శన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సంపూర్ణ సహకారం అందించారు. గ్రామీణ ప్రాంత బాలికల విద్యను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రతిభావంతులైన విద్యార్థినులకు అవార్డులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ జెండాను ఆవిష్కరించిన సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ లతీఫ్

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ లతీఫ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ లతీఫ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి సరైన సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ప్రెస్ క్లబ్ సభ్యులకు, ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సాయిగౌడ్, మోయిన్, సుధాకర్, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్, సాయిరెడ్డి, ఖాలేక్, అంబిల్‌పూర్ రాజు, రమణ, సుధాకర్ గౌడ్, మధు రెడ్డి, పండరి గౌడ్, హైమద్, పోచిరాం, చందు, శ్రీను, నబీ, ఆనంద్, శ్రీనివాస్, సతీష్, ప్రదీప్, రాజేష్, హనుమాన్లు, సతీష్ గౌడ్, నరేష్ గౌడ్, ప్రమోద్ రెడ్డి, యూనుస్, రషీద్, సలీం, మహేష్, అశోక్, సతీష్, లక్ష్మణ్,మహేష్, సుభాష్, జాకీర్, రవీందర్ గౌడ్, ఇలియాస్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.



# ప్రతి మహిళా శక్తిగా ఎదగాలి

## ఏపిఎం బత్తుల మాణిక్యం



వేల్పూర్, బతుకమ్మ :ప్రతి మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధించి దేశ ఆర్థిక రంగాన్ని శాసించే స్థాయికి ఎదగాలని వేల్పూర్ ఏపిఎం బత్తుల మాణిక్యం అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వేల్పూర్ మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించి మహిళలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా సహకారం అందిస్తున్నామని తెలిపారు. పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సుల నిర్వహణతో పాటు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకునే మహిళలకు రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకుని పిండి గిర్నీలు, కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్లు, కుట్టు మిషన్ల ద్వారా ఉపాధి, బట్టల వ్యాపారం తదితర రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఏపీఓ అశోక్, సీసీలు వెన్న మురళి, సాయన్న, సరళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద స్కాలర్స్ హై స్కూల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



బిచ్కుంద, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని స్కాలర్స్ హై స్కూల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిచ్కుంద ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జాడ వినీల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జడ్జి జాడ వినీల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులే భావి భారత పౌరులని, దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు బాధ్యతాయుతంగా ప్రవర్తించడం, గురువులు, తల్లిదండ్రులను గౌరవించడం, చిన్ననాటి నుంచే దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవీర్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

మోర్తాడ్, బతుకమ్మ :మోర్తాడ్ మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడగా, దేశభక్తి నినాదాలతో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాలలు, యువజన సంఘాలు, యూనియన్ నాయకులు, కుల సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనేక పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఇందల్వాయి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పాశం చిన్న నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెండా ఆవిష్కరణతో పాటు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం చిన్న నరసింహులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు దేశ ప్రజలకు ఓటు హక్కు, చట్టసభల్లో రిజర్వేషన్లు వంటి హక్కులు సాధ్యమయ్యాయని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు తుమ్మల నరేష్, పూజ్యం వీరయ్య, కమ్మరి పెద్ద గంగారం, పాశం ప్రవీణ్, లక్ష్మణ్, సదర్ పెద్దమనిషి సత్యం, సాయిబాబా, జెపీఆర్ కాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.






## హిందువులు ఐకమత్యంగా ముందుకు సాగాలి

రుద్రూర్, బతుకమ్మ :సమాజ శ్రేయస్సు కోసం.. సనాతన ధర్మం కోసం హిందువులు ఏకతాటిపై నడవాలని, హిందువులు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆర్ఎస్ఎస్ డాక్టర్ వారి దస్తగిరి, శ్రీధర్.జి అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సాలలో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో శనివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ హిందూ యువశక్తి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనంలో కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాలకు చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ డాక్టర్ వారి దస్తగిరి, శ్రీధర్.జి మాట్లాడుతూ.. హిందూ ధర్మం కోసం అప్పట్లోనే విదేశీయులతో పోరాడారనీ, పురానాలు, ఇతిహాసాలు, సాంప్రదాయాల ప్రారంభంతో సనాతన ధర్మం ప్రారంభమైందని, ఈ ధర్మం ప్రతిరూపమే హిందూ సమ్మేళనమని అన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మం పాటించినప్పుడే ధర్మం నడుస్తుందన్నారు. అదే విధంగా సమాజ సేవ, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ఏర్గట్ల గ్రామ లబ్ధిదారులకు
# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఏర్గట్ల, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్గట్ల మండలంలోని ఏర్గట్ల గ్రామానికి చెందిన లబ్ధిదారులు జుంగల గంగు, హుస్సేన్ బి.లకు స్మార్ట్ రేషన్ కార్డులను వేదికపై అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులను అందుకున్న లబ్ధిదారులు జుంగల గంగు, హుస్సేన్ బి.లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండల తహసీల్దార్ జె. మల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, మండల ఆర్ఐ రవి, జీపీఓలు వెంకటేష్, సంపత్, భూమన్న, మధుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల రేషన్ దుకాణాల డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జె. మల్లయ్య మాట్లాడుతూ, మండలంలోని మిగతా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన తేదీల ప్రకారం వారి వారి గ్రామాల్లో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



### జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రోజ్‌మేరీ ఆయిల్..
## అధ్యయనంలో వెల్లడి..



ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో సహజసిద్ధమైన మూలికలు, వాటి ప్రయోజనాలపై ఆసక్తి పెరుగుతోంది. వంటింట్లో సాధారణంగా ఉపయోగించే రోజ్‌మేరీ కూడా ఇప్పుడు ఆరోగ్య ప్రయోజనాల కారణంగా ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ రోజ్‌మేరీలో ఉన్న పలు ఔషధ గుణాలను ప్రస్తావిస్తూ, జ్ఞాపకశక్తి, మానసిక ఏకాగ్రతతోపాటు జుట్టు, తల చర్మ ఆరోగ్యానికి కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. అయితే రోజ్‌మేరీ, ముఖ్యంగా దాని ఎసెన్షియల్ ఆయిల్‌ను మోతాదుకు మించి లేదా సరైన విధానం లేకుండా ఉపయోగించడం వల్ల దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించడం అవసరం. రోజ్‌మేరీని ఎప్పటి నుంచో జ్ఞాపకశక్తికి సంబంధించిన మూలికగా పరిగణిస్తున్నారు. రోజ్‌మేరీలో ఉండే సువాసనతో కూడిన కొన్ని క్రియాశీల సమ్మేళనాలు మెదడులోని నాడీ సంకేతాల ప్రసారానికి సహాయపడటంతోపాటు ఆక్సిడేటివ్ డ్యామేజ్ నుంచి నాడీ వ్యవస్థను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 1,8-సినియోల్ అనే సమ్మేళనం రోజ్‌మేరీలో ఉండే ముఖ్యమైన క్రియాశీల పదార్థాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

# దీర్ఘకాలం పాటు కండరాల నొప్పులు, వాపులు ఉంటున్నాయా..
# జాగ్రత్త అది క్యాన్సర్ కావచ్చు..

కండరాలకు గాయం అవవడం లేదా కండరాలు పట్టేయడం చాలా సాధారణమైన సమస్య. సాధారణంగా విశ్రాంతి, మందులు, ఫిజియోథెరపీతో ఇలాంటి సమస్యలు తగ్గిపోతాయి. అయితే ప్రతి కండరాల నొప్పి లేదా వాపును సాధారణ కండరాల గాయంగానే భావించడం సరైంది కాదు. కొన్నిసార్లు స్పోర్ట్స్ ఇంజ్యూరీ లేదా గాయం తర్వాత వచ్చిన వాపులా కనిపించే సమస్య వెనుక సాఫ్ట్ టిష్యూ సార్కోమా అనే క్యాన్సర్ ఉండే అవకాశం కూడా ఉంటుంది. దీనిని ప్రారంభ దశలో గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే వ్యాధి నిర్ధారణ ఆలస్యమైతే చికిత్స, ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇటీవల తొడ భాగంలో చాలాకాలంగా కండరాలు బిగుసుకుపోయినట్లు అనిపిస్తున్న ఓ వ్యక్తి పలువురు వైద్యులను సంప్రదించాడు. స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులను కూడా కలిసినప్పటికీ సమస్యకు స్పష్టమైన కారణం గుర్తించలేకపోయారు. కొంతకాలం పాటు దీనిని సాధారణ కండరాల సమస్యగానే భావించారు. చివరకు ఎండోక్రైనాలజిస్ట్ సూచనతో ఆ వ్యక్తి ఆర్థోపెడిక్ ఆంకాలజిస్ట్‌ను సంప్రదించాడు. అనంతరం నిర్వహించిన ఎంఆర్ఐలో తొడ కండరాల లోపల అసాధారణంగా పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. ఇమేజింగ్ సహాయంతో నిర్వహించిన బయాప్సీలో అది సార్కోమాగా నిర్ధారణ అయింది. ఆ తర్వాత రోగికి శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

**లక్షణాలు అందరిలో ఒకేలా ఉండవు..**

ఈ ఘటనలో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. క్యాన్సర్ లక్షణాలు ప్రతి ఒక్కరిలో ఒకే విధంగా కనిపించవు. కొన్నిసార్లు వాటి లక్షణాలు ఇతర సాధారణ సమస్యల మాదిరిగా కనిపిస్తాయి. రోగులు, వైద్యులు కూడా మొదట తీవ్రమైన వ్యాధి కంటే సాధారణ కారణాన్నే అనుమానించడం సహజం. అయితే సమస్య సాధారణ చికిత్సకు స్పందించకుండా కొనసాగుతున్నప్పుడు మరింత లోతైన పరీక్షలు చేయడం అవసరం. ప్రారంభ దశలో హెచ్చరిక సంకేతాలను గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుంది. సాధారణ కండరాల గాయం లేదా స్ట్రెయిన్ సాధారణంగా గాయం జరిగిన వెంటనే నొప్పిని కలిగిస్తుంది. చికిత్స, విశ్రాంతితో నొప్పి క్రమంగా తగ్గుతూ ఉంటుంది. కోలుకోవడానికి కొంత సమయం పట్టినా సాధారణంగా లక్షణాలు ఒక నిర్దిష్ట విధానంలో మెరుగుపడతాయి. ఇలాంటి గాయాల వల్ల శరీరంలో నిరంతరం ఉండే గడ్డ లేదా వాపు సాధారణంగా కనిపించదు. అలాగే కండరాల నిర్మాణంలో దీర్ఘకాలిక మార్పులు కూడా ఉండవు. సాఫ్ట్ టిష్యూ సార్కోమా మాత్రం భిన్నంగా ప్రవర్తిస్తుంది. ఇది నెమ్మదిగా ప్రారంభమవుతుంది. ప్రారంభ దశలో నొప్పి ఉండదు. అయితే కణితి పరిమాణం పెరుగుతున్న కొద్దీ నొప్పి వస్తుంది. సాధారణ కండరాల గాయం మాదిరిగా తగ్గిపోకుండా వాపు లేదా గడ్డ అలాగే ఉండటంతోపాటు క్రమంగా పరిమాణం పెరుగుతూ ఉంటుంది.

**ఏ భాగంలోనైనా వచ్చే అవకాశం..**

చాలా సందర్భాల్లో చిన్నపాటి గాయం తర్వాతే రోగి శరీరంలో ఉన్న గడ్డను గమనించేందుకు వీలుంటుంది. దీంతో గాయం వల్లే గడ్డ ఏర్పడిందని అనుకుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో గడ్డ అప్పటికే శరీరంలో ఉండి ఉంటుంది. గాయం కారణంగా దానిపై దృష్టి పడటం మాత్రమే జరుగుతుంది. అందువల్ల గాయం తర్వాత కనిపించిన ప్రతి గడ్డను గాయం వల్ల వచ్చిన వాపుగానే భావించకూడదు. సార్కోమాలు శరీరంలోని దాదాపు ఏ భాగంలోనైనా ఏర్పడే అవకాశం ఉంటుంది. చేతులు, కాళ్లు, శరీర మధ్యభాగం, పొత్తికడుపు, ఛాతీ, వెన్నెముక, మెదడు వంటి ప్రాంతాల్లో కూడా ఇవి కనిపిస్తాయి. అయితే సాఫ్ట్ టిష్యూ సార్కోమాలు చేతులు, కాళ్లు, శరీరంలోని పైభాగంలోని కణజాలాల్లో ఎక్కువగా గుర్తించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో కనిపించే గడ్డలు, వాపులను నిర్లక్ష్యం చేయకూడదు. ఏదైనా గడ్డ లేదా వాపు నొప్పితో ఉన్నా లేకపోయినా రెండు వారాల్లో తగ్గకపోతే వైద్య పరీక్ష చేయించుకోవడం మంచిది. సాధారణ గాయాలతో పోలిస్తే సార్కోమా వల్ల ఏర్పడే గడ్డలు కాలక్రమేణా పెరుగుతూనే ఉంటాయి. అవి గట్టిగా, అసమాన నిర్మాణంతో ఉండి సాధారణ గాయం వల్ల వచ్చే వాపు కంటే పెద్దగా కనిపించే అవకాశం ఉంటుంది.

**వైద్య పరీక్షలు కీలకం..**

గాయం వల్ల ఏర్పడే వాపు సాధారణంగా గాయం జరిగిన వెంటనే కనిపిస్తుంది. ప్రారంభంలో ఎర్రగా, నొప్పిగా, తాకితే సున్నితంగా ఉంటుంది. రోజులు లేదా వారాలు గడిచే కొద్దీ అది క్రమంగా తగ్గుతుంది. ఇమేజింగ్ పరీక్షల్లో కూడా గాయం కారణంగా ఏర్పడిన రక్తస్రావం, కణజాల మార్పులు కాలక్రమేణా ఒక నిర్దిష్ట విధంగా మారుతాయి. సార్కోమా వల్ల ఏర్పడే గడ్డ మాత్రం సాధారణ గాయం మాదిరిగా తగ్గదు. వాపు అలాగే కొనసాగడం, పరిమాణం పెరగడం, సాధారణ చికిత్సకు స్పందించకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో కేవలం నొప్పి తగ్గించే మందులు లేదా ఫిజియోథెరపీతో సమస్య పరిష్కారమవుతుందని భావించకుండా వైద్యుల సలహా తీసుకోవాలి. నిరంతరం ఉండే లేదా అనుమానాస్పదంగా కనిపించే వాపును శాస్త్రీయంగా పరీక్షించడం అవసరం. మొదట అల్ట్రాసౌండ్ వంటి సాధారణ పరీక్ష చేస్తారు. అవసరాన్ని బట్టి ఎంఆర్ఐ నిర్వహిస్తారు. ఇమేజింగ్ ద్వారా గడ్డ స్వభావం, దాని పరిమాణం, పరిసర కణజాలంతో సంబంధం వంటి విషయాలపై వైద్యులకు స్పష్టత వస్తుంది. ఇమేజింగ్ పరీక్షల్లో అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే ఇమేజ్ గైడెడ్ బయాప్సీ ద్వారా కణజాల నమూనాను పరీక్షించడం కీలకం. బయాప్సీ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయడంతోపాటు రోగికి ఏ విధమైన చికిత్స అవసరమో నిర్ణయించేందుకు సహాయపడుతుంది. వ్యాధి రకం, తీవ్రతను బట్టి కొంతమంది రోగులకు శస్త్రచికిత్సకు ముందు కీమోథెరపీ వంటి చికిత్సలు కూడా అవసరం అవుతాయి.

**నేరుగా తొలగించవద్దు..**

అనుమానాస్పదంగా ఉన్న గడ్డను సరైన పరీక్షలు చేయకుండా నేరుగా తొలగించే ప్రయత్నం చేయడం సమస్యలను మరింత క్లిష్టం చేస్తుంది. అందువల్ల ఇలాంటి గడ్డలను తొలగించే ముందు అవసరమైన ఇమేజింగ్,



బయాప్సీ, నిపుణుల సలహా, తగిన చికిత్సా ప్రణాళిక ఉండటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సాఫ్ట్ టిష్యూ సార్కోమాలు తీవ్రమైన క్యాన్సర్ రకాలలో ఒకటైనా, వాటిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స మరింత సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. సరైన సమయంలో ఇమేజింగ్, తగిన బయాప్సీ, నిపుణుల బృందం ఆధ్వర్యంలో చికిత్స అందించడం ద్వారా ఫలితాలను మెరుగుపరచవచ్చు. చాలా కండరాల స్ట్రెయిన్‌లు సాధారణమైనవే, విశ్రాంతి, సంప్రదాయ చికిత్సతో తగ్గిపోతాయి. అయితే నొప్పి లేదా వాపు తగ్గకుండా కొనసాగడం, కొత్తగా గడ్డ ఏర్పడటం, గడ్డ పరిమాణం పెరగడం, సాధారణ చికిత్సకు స్పందించకపోవడం వంటి లక్షణాలు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. సాధారణ కండరాల గాయం ఎప్పుడు సాధారణంగా కోలుకునే విధానంలో ఉందో, లేదో గుర్తించడం ద్వారా అరుదైన, తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు.